వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 054
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
ఫిబ్రవరి 06, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


8లో..

# మూడు నెలల్లో కొత్త పార్టీ

- ముహూర్తం కోసం ఎదురుచూస్తున్న కవిత
- ప్రజలే తమ నాయకులంటూ ప్రకటన

# గుట్ట పై.. రాజకీయం





## గోవిందరాజస్వామి దేవాలయంలో ఇష్టారాజ్యం

వివరాలు2లో..

- అర్చకుల మధ్య విభేదాలు సృష్టిస్తున్న కార్పొరేటర్
- మంది, మార్బలంతో దాడి, చంపుతామంటూ బెదిరింపులు
- గోవిందాద్రి సేవాదళ్ పేరిట అనధికార ట్రస్ట్
- అధిక మొత్తంలో చందాలు వసూలు
- అనుమతులు లేకుండా గోశాల నిర్వహణ
- ఆలయాన్ని పరిరక్షించాలంటూ మంత్రి సురేఖ, డీసీకి అర్చకుల వినతి



ఓరుగల్లు నగరానికి ఐకాన్ గా వెలుగొందుతున్న శ్రీ గోవిందరాజస్వామి దేవాలయం రాజకీయ నాయకులకు అడ్డాగా మారింది. అర్చకులు ఉండాల్సిన ప్రాంతంలో అమాత్యులు, వారి అనుచరులు సంచరిస్తూ రాజకీయం చేస్తున్నారు. దేవాలయాన్ని భ్రష్టు పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నారు. మంది మార్బలంతో అడ్డా వేసి అర్చకులపై దాడులు చేస్తున్నారు. చంపుతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. దేవుడి సేవలో తరించాల్సిన అర్చకుల మధ్య విభేదాలు సృష్టించి గొడవలకు ఆజ్యం పోస్తున్నారు. గత ముప్పై సంవత్సరాలుగా దేవుడి సేవ చేస్తున్న వారిని కాదని రాజకీయ నాయకుడి అడుగులకు మడుగులొత్తుతున్న వారికి పెద్ద పీట వేస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు అర్చకులపై చెడుగా ప్రచారం చేస్తున్నారు. ఆలయంతో సంబంధంలేని అర్చకులు, స్థానికులు, మహిళా లీడర్లతో అనధికారికంగా గోవిందాద్రి సేవాదళ్ పేర ట్రస్ట్ ఏర్పాటు చేసి చందాల రూపంలో అందినంత దండుకుంటున్నారు. దేవాదాయ శాఖ అనుమతులు లేకుండానే గోశాలను నిర్వహిస్తూ అర్చకులకు సవాల్ విసురుతున్నారు. దీంతో మానసిక క్షోభను అనుభవిస్తున్న శ్రీ గోవిందరాజ స్వామి దేవస్థానం పాలకవర్గ ఎక్స్ అఫిషియో సభ్యులు వరయోగుల లక్ష్మణస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి, ఆలయ అర్చకులు వర యోగుల మురళీకృష్ణ స్వామి, ప్రసాద్ స్వామి తదితరులు శుక్రవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి గుట్టపై రాజకీయ పెత్తనం లేకుండా చూడాలని వేడుకున్నారు. అనంతరం దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ను కూడా కలిసి వినతి పత్రం అందజేశారు. - వరంగల్ వాయిస్ ప్రతినిధి


8లో..

## ఎన్నికలను సమర్థవంతంగా నిర్వర్తించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- మున్సిపల్ ఎన్నికలపై పీఓ, ఏపీఓలకు శిక్షణ


8లో..

## అప్రమత్తంగా ఉండాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- పులి సంచారం నేపథ్యంలో ఆకస్మిక తనిఖీ


8లో..

## వర్ధన్నపేట మున్సిపాలిటీపై కాంగ్రెస్ గురి

- ఎన్నికల వ్యూహ రచనలో ఇనగాల, ఎమ్మెల్యే నాగరాజు


8లో..

## అగ్రంపాడులో భక్తుల రద్దీ

# గుట్టపై రాజకీయం

- గోవిందరాజస్వామి దేవాలయంలో ఇష్టారాజ్యం
- అర్చకుల మధ్య విభేదాలు సృష్టిస్తున్న కార్పొరేటర్
- మంది, మార్బలంతో దాడి,
- చంపుతామంటూ బెదిరింపులు
- గోవిందాద్రి సేవాదళ్ పేరిట అనధికార ట్రస్ట్
- అధిక మొత్తంలో చందాలు వసూలు
- అనుమతులు లేకుండా గోశాల నిర్వహణ
- ఆలయాన్ని పరిరక్షించాలంటూ మంత్రి సురేఖ, డీసీకి అర్చకుల వినతి



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** గోవిందరాజుల గుట్ట ఒక చారిత్రక ప్రదేశం. గుట్టపై కొలువై ఉన్న గోవిందరాజస్వామికి వందల ఏళ్ల నాటి చరిత్ర ఉంది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడికి సోదరుడిగా గోవిందరాజస్వామిని భక్తులు భావిస్తుంటారు. స్వామి స్వయంభుగా ఈ కొండపై వెలిశాడని, 11వ శతాబ్దంలో ఈ ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన గుట్టపై నేడు రాజకీయం రాజ్యమేలుతోంది. భక్తులకు ప్రశాంతత కల్పించాల్సిన ప్రాంతం రాజకీయ నాయకుల మంది మార్బలానికి అడ్డాగా మారింది. ఆలయాన్ని తన గుప్పిట బంధించేందుకు స్థానిక కార్పొరేటర్ చేస్తున్న ప్రయత్నాలు అంతా ఇంతా కాదని చెప్పవచ్చు. భక్తులకు అర్చకులపై చెడుగా చెబుతూ ఆలయానికి ఎవ్వరూ రాకుండా అడ్డుకట్ట వేయడం విమర్శలకు దారితీసింది. రాజకీయ నాయకులకు గుడితో సంబంధం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### మంత్రికి ఫిర్యాదు..

గోవిందరాజస్వామి దేవాలయంలో స్థానిక 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, వారి సోదరుడు చింతాకుల సునీల్ అర్చకుల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఫిర్యాదు చేశారు. శ్రీ గోవిందరాజ స్వామి దేవస్థానం పాలకవర్గ ఎక్స్ అఫిషియో సభ్యులు వరయోగుల లక్ష్మణస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాస స్వామి, ఆలయ అర్చకులు వర యోగుల మురళీకృష్ణ స్వామి, ప్రసాద్ స్వామి తదితరులు శుక్రవారం హనుమకొండ రాంనగర్ లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆలయంలో సంబంధం లేని అర్చకులు, స్థానికులు, మహిళా లీడర్లతో గోవిందాద్రి సేవాదళ్ పేరిట ఒక అనధికార ట్రస్టును ఏర్పాటు చేసి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండానే శ్రీ గోవిందరాజస్వామి దేవస్థానంలో గోశాల పేరిట పెద్ద ఎత్తున చందాలు వసూలు చేశారని, గుట్ట వద్ద గోవులను ఏర్పాటు చేశారన్నారు. గోవిందాద్రి సేవాదళ్ పేరిట కొంతమంది సభ్యులు మా పూజా కార్యక్రమాలను, విధివిధానాలను ప్రశ్నిస్తున్నారని ఆరోపించారు. అభిషేకాలు, నివేదనలు సరిగా చేయడంలేదంటూ మమ్ములను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

### చంపుతామంటూ బెదిరింపులు..

గత 30 సంవత్సరములుగా దేవుని సేవలో తరిస్తూ, దేవాదాయ శాఖ ద్వారా ఎటువంటి జీతాలు పొందకుండా భక్తులు ఇచ్చే సంభావనల ద్వారా మా నిరుపేద కుటుంబాలను పోషించుకుంటున్నామని మంత్రికి వివరించారు. స్థానిక రాజకీయ నాయకులు చింతాకుల అనిల్ కుమార్, సునీల్ దేవాలయం విషయంలో జోక్యం చేసుకుంటూ మమ్ములను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వారి అనుచరుల ద్వారా చంపుతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని మంత్రికి ఫిర్యాదు చేశారు.

### గిరి ప్రదర్శన పేరిట విభేదాలు..

రాజకీయ నాయకుడి అనధికార ట్రస్ట్ అయినా గోవిందాద్రి సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షులు అడిగే రంజిత్ కుమార్, దేవాలయ తాత్కాలిక అర్చకులు వరయోగుల అరుణ్ కుమార్ స్వామిని ముందు పెట్టి వారి ద్వారా గోవిందాద్రి గిరి ప్రదక్షిణ గ్రూపును సృష్టించి మేమే ఇది చేస్తున్నాం.. అది చేస్తున్నామంటూ ప్రచారం చేసుకుంటున్నారని అర్చకులు ఆరోపించారు. గ్రూపులోని సభ్యులను మభ్యపెడుతూ లేనివి ఉన్నట్టుగా ప్రచారం చేస్తున్నారు. శ్రీ గోవిందరాజ స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న గోవిందాద్రి సేవాదళ్ పై దేవాదాయ శాఖ అధికారులు విచారణ జరిపించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం దేవాదాయ శాఖ డీసీ సునీతను కూడా కలిసి వినతి పత్రం అందజేశారు.



### స్పందించిన మంత్రి..

అర్చకులు ఇచ్చిన వినతికి మంత్రి కొండా సురేఖ స్పందించినట్లు వారు ప్రకటించారు. వెంటనే దేవాదాయ శాఖ డీసీ రామల సునీతకు ఫోన్ ద్వారా గోవిందరాజుల గుట్ట అక్రమాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అనధికార ట్రస్ట్ గోవిందాద్రి సేవాదళ్ పై పూర్తి న్యాయ విచారణ జరిపించాలని ఆదేశించారు. దేవాదాయ శాఖ అనుమతులు లేకుండా గోశాల ఏర్పాటు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టేలా పోలీసులకు సిఫారస్ చేయాలని సూచించారు. అనంతరం శ్రీ గోవిందరాజ స్వామి ఆలయ అర్చకులు స్వామివారి శేష వస్త్రముతో మంత్రి కొండా సురేఖను ఘనంగా సన్మానించి వేద ఆశీర్వచనం నిర్వహించారు.

# ఫార్మసీ అధికారుల పాత్ర కీలకం

**వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వైద్య ఆరోగ్య శాఖలో ఫార్మసీ అధికారులు అత్యంత కీలకమైన భూమిక పోషిస్తున్నారని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం హనుమకొండ, వరంగల్ జిల్లాల ఫార్మసీ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన ఫార్మసీ అధికారులు తమ విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా జిల్లా వ్యాక్సిన్ స్టోర్లలో ఫార్మసీ అధికారికి డిప్యూటేషన్ ఇవ్వాలని, అత్యవసర సమయాల్లో సీఎంఎస్ నుంచి మందుల రవాణా కోసం సంవత్సరానికి రూ.15 వేలు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఫార్మసీ అధికారులపై అధిక పని భారం ఉండటంతో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో కనీసం ముగ్గురు ఫార్మసీ అధికారులను నియమించేందుకు రాష్ట్ర అధికారులకు సిఫార్సు చేస్తూ అధికారిక లేఖ పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలపై స్పందించిన డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, ఫార్మసీ అధికారులు వైద్య ఆరోగ్య శాఖలో అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. ఫార్మసీ అధికారుల సమస్యలను పరిష్కరించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని, అదనపు ఫార్మసీ అధికారుల పోస్టుల మంజూరుకు సంబంధించి రాష్ట్ర అధికారులకు లేఖలు పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ, ఫార్మసీ అధికారుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర అధికారులు, మంత్రులతో నిరంతరం చర్చలు జరుపుతూ అనేక రిప్రజెంటేషన్లు అందజేశామని తెలిపారు. ఫార్మసీ అధికారులకు బంగారు భవిష్యత్ అందించడమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు నార్ల వేణు, హన్మకొండ జిల్లా కార్యదర్శి సతీష్, అసోసియేషన్ నాయకులు సంతోష్, నాగేందర్, వెంకన్న, విజయ, సునీత, విజయలక్ష్మి, శ్రీదేవి, సృజన తదితరులతో పాటు వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన సుమారు 50 మంది ఫార్మసీ అధికారులు పాల్గొన్నారు.




# సేవాపథంలో వాసవి క్లబ్ ఆదర్శంగా నిలవాలి

**కేసీజీఎఫ్ ప్రతినిధులు**

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండల కేంద్రంలోని ఆర్యవైశ్య భవనంలో వాసవి క్లబ్, వనితా క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేసీజీఎఫ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు సిద్ధ వెంకట సూర్యప్రకాశ్, ఉపాధ్యక్షులు పవిత్రం శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ గవర్నర్ మంచాల విజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన కార్యవర్గం వాసవి క్లబ్ అధ్యక్షుడు కూరెళ్ల ఉపేందర్ (పెద్ద), ఉపాధ్యక్షులు కూరెళ్ల చిన్న ఉపేందర్, కార్యదర్శి పజ్జూరి రాజు, కోశాధికారి లగిశెట్టి వీరలింగం, వనితా క్లబ్ అధ్యక్షురాలిగా కూరెళ్ళి రేణుక, ఉపాధ్యక్షురాలు ఒరుగంటి శోభరాణి, కార్యదర్శి పోకల లావణ్య, కోశాధికారిగా కూరెళ్లి ఉష ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. వాసవి క్లబ్ అందించే సేవా కార్యక్రమాలు సమాజానికి దిక్సూచిలా ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా మహిళలు వనితా క్లబ్ ద్వారా సామాజిక సేవా రంగంలో ముందుండాలని పిలుపునిచ్చారు. నూతన సభ్యులు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల ద్వారా సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అతిథులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు పోకల శివకుమార్, పుల్లూరు కిషోర్, విడియాల నూతన్ కుమార్, రామ్ రవీందర్, ఒరుగంటి శంకర్ లింగం, మండలంలోని వివిధ గ్రామాల ఆర్యవైశ్యులు, మహిళలు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# రేపు 'గోపోషక రైతుల సమ్మేళనం'

◆ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**వరంగల్ వాయిస్, రేగొండ:** హనుమకొండ చింతగట్టు సమీపంలోని బిజిఆర్ గార్డెన్ (మహర్షి గోశాల) వేదికగా శనివారం నిర్వహించనున్న 'గోపోషక రైతుల సమ్మేళనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శివకేశవ గోశాల సేవా సమితి జిల్లా అధ్యక్షులు సిరికొండ తిరుపతిరావు కోరారు. తెలంగాణ గోశాల సేవా సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న గో ప్రేమికులు, రైతుల కోసం ఈ ప్రత్యేక సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ముఖ్య అతిథిగా, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ విశిష్ట అతిథిగా హాజరుకానున్నారు. వీరితో పాటు నాబార్డ్ ఏజీఎం చైతన్య, వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, పశువైద్య అధికారి డాక్టర్ రాధాకిషన్, వ్యవసాయ నిపుణులు విజయరామ్ తదితరులు పాల్గొని గోపోషణ, ప్రభుత్వ పథకాలపై రైతులకు దిశానిర్దేశం చేస్తారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంపై రైతులకు నిపుణులచే అవగాహన, శిక్షణ, పశుపోషణలో ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పథకాలపై వివరణ, నాణ్యమైన పశుగ్రాసం పెంపకం, మార్కెటింగ్ మెలకువల్లో మెళకువలు, గో ఆధారిత రైతులను ఏకం చేసేందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటుపై చర్చించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్



జిల్లాల నుంచి గోపోషకులు, ప్రకృతి వ్యవసాయదారులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహర్షి గోశాల ట్రస్టీ రమేష్, సిరికొండ తిరుపతిరావు విజ్ఞప్తి చేశారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండల కేంద్రంలో ఇటీవల మరణించిన మాజీ గ్రామ రెవెన్యూ అధికారి బొట్ల కనకరాజు, మాజీ వార్డు సభ్యులు బొట్ల యాకయ్య కుటుంబాలను సీనియర్ రాజకీయ నాయకులు, ప్రథమ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు శుక్రవారం పరామర్శించారు. వారి నివాసాలకు వెళ్లిన రాములు.. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టసమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని ఆయన కోరారు. ఈ పరామర్శలో మేడిశెట్టి రాములు వెంట మాజీ వైస్ ఎంపీపీ జూలపల్లి గంగాధర్ రావు, మాజీ ఫ్యాక్స్ వైస్ చైర్మన్ సందేల ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు దూలపల్లి సురేందర్రావు, మాజీ ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, కాంగ్రెస్ నాయకులు బొట్ల కనకరాజు, కుమారస్వామి, బీఆర్ఎస్ నాయకులు గోని సంపత్, ఏకాంతం, సుధాకర్, డాక్టర్ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్మయ్య, రమేష్, కొండ వెంకన్న, భిక్షపతి తదితరులు పాల్గొని మృతులకు నివాళులర్పించారు.

## బాధితులకు అండగా 'సీఈఐఆర్'

### నలుగురికి పోగొట్టుకున్న మొబైల్స్ అందజేత



**వరంగల్ వాయిస్, చిట్యాల :** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అండతో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను వెలికితీసి బాధితులకు అందజేయడంలో చిట్యాల పోలీసులు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. చిట్యాల ఎస్సై శ్రావణ్ కుమార్ గురువారం పోలీస్ స్టేషన్‌లో రికవరీ చేసిన నాలుగు ఖరీదైన మొబైల్ ఫోన్లను బాధితులకు అప్పగించారు. గత కొంతకాలంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు వ్యక్తులు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు స్పందించిన ఎస్సై శ్రావణ్ కుమార్, సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ బాధ్యతలు చూస్తున్న కానిస్టేబుల్ లాల్ సింగ్‌ను అప్రమత్తం చేశారు. సాంకేతిక ఆధారాలతో ఫోన్లను ట్రాక్ చేసిన పోలీసులు, ఎట్టకేలకు వాటి ఆచూకీ కనుగొని రికవరీ చేశారు. ఫోన్లు పొందిన వారిలో సర్వ శరత్ కుమార్ (నవాబుపేట): వివో టీ5 ప్రో, అనుప మహేష్ (నవాబుపేట): రెడ్మి నోట్ 12 ప్రో, దువ్వల ప్రవీణ్ (నవాబుపేట): ఒప్పో మొబైల్, మేకల గణేష్ (శాంతినగర్): ఒప్పో మొబైల్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు ఆందోళన చెందకుండా వెంటనే పోలీస్ స్టేషన్‌లో లేదా ఆన్‌లైన్ ద్వారా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. "టెక్నాలజీ సాయంతో ఫోన్లను రికవరీ చేయడం ఇప్పుడు చాలా సులభమైంది. ఎవరికైనా ఇతరుల ఫోన్లు దొరికితే వెంటనే పోలీసులకు అప్పగించాలి. వాటిని వాడటం లేదా అమ్మడం చట్టరీత్యా నేరం." అని ఆయన హెచ్చరించారు. పోగొట్టుకున్న ఫోన్లను అతి తక్కువ కాలంలోనే వెతికి ఇచ్చినందుకు బాధితులు ఎస్సై శ్రావణ్ కుమార్, కానిస్టేబుల్ లాల్ సింగ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామంలో మద్యపానం నిషేధించాలి

### 'యూత్ ఫర్ గుడ్ సొసైటీ' డిమాండ్



**వరంగల్ వాయిస్, దామెర :** మద్యపానం మహమ్మారి వల్ల పులుకుర్తి గ్రామంలోని అనేక కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని, యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ 'యూత్ ఫర్ గుడ్ సొసైటీ' సభ్యులు మద్యపాన నిషేధం కోసం ముందడుగు వేశారు. శుక్రవారం దామెర మండలం పులుకుర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు గోవిందు రవికుమార్ మాట్లాడుతూ.. గ్రామంలో మద్యం సేవించి యువత బానిసలుగా మారుతున్నారని, దీనివల్ల నిత్యం గొడవలు జరగడమే కాకుండా ఆర్థికంగా అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మన గ్రామం, మన యువత బాగుండాలంటే పులుకుర్తిలో మద్యపానాన్ని పూర్తిగా నిషేధించాలని ఆయన కోరారు. సర్పంచ్ పెంచాల స్వరూప సహకారంతో గ్రామాన్ని మద్యరహిత గ్రామంగా తీర్చిదిద్దాలని వారు విజ్ఞప్తి చేశారు. యువత తీసుకున్న ఈ సామాజిక నిర్ణయానికి పలువురు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మద్యపానం వల్ల కలిగే అనర్థాలను అరికట్టేందుకు పంచాయతీ పాలకవర్గం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు గోవిందు మహిపాల్, చిలుముల ప్రమోద్, గోవిందు చంటి, చిలుముల చందు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి


### తహసీల్దార్ ఇమామ్ బాబా షేక్



**వరంగల్ వాయిస్, చిట్యాల:** చిట్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం గురువారం జిల్లా స్థాయి క్రీడా కోలాహలానికి వేదికైంది. భూపాలపల్లి జిల్లా స్థాయి 'సీఎం కప్ అండర్-18' బాల్ బ్యాడ్మింటన్ బాలబాలికల ఎంపిక పోటీలను ఇక్కడ అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో) ఇమామ్ బాబా షేక్ హాజరై, క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. వారిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 11 మంది బాలికలు, 11 మంది బాలురను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. "ఎంపికైన క్రీడాకారులు జిల్లా జట్టు గర్వపడేలా రాణించి, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలి" అని ఆయన ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులను అభినందించిన నిర్వాహకులు, ఎమ్మార్వోను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ బాధ్యులు, కోచ్‌లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## డీసీపీ కవితను కలిసిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బృందం

**వరంగల్ వాయిస్, వరంగల్:** గత నెల 10న కిడ్నాపర్ల ముఠా చెర నుంచి పోలీసులు విముక్తి కలిగించిన ఐదుగురు చిన్నారుల భవిష్యత్తుపై అధికారులు దృష్టి సారించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, ఈ చిన్నారుల బయోలాజికల్ పేరెంట్స్ (నిజమైన తల్లిదండ్రుల) ఆచూకీ కోసం దర్యాప్తును ముమ్మరం చేయాలని కోరుతూ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (CWC) ప్రతినిధులు శుక్రవారం సెంట్రల్ జోన్ డీసీపీ దార కవితను, అదనపు డీసీపీ ఎన్.రవిని కలిశారు. ఈ సందర్భంగా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ అన్నమనేని అనిల్ చందర్ రావు మాట్లాడుతూ.. కిడ్నాపర్ల నుంచి రక్షించబడిన ఐదుగురు చిన్నారులను ప్రస్తుతం శిశు గృహలో ఉంచి సంరక్షిస్తున్నట్లు తెలిపారు. వీరిలో గత ఏడాది కాజీపేట, వరంగల్ రైల్వే స్టేషన్ల పరిధిలో తప్పిపోయిన ఇద్దరు చిన్నారుల తల్లిదండ్రులను గుర్తించామని వెల్లడించారు. అన్ని ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఆ ఇద్దరు పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు వివరించారు. మిగిలిన ముగ్గురు పిల్లల తల్లిదండ్రుల ఆచూకీ లభించాల్సి ఉందని, పోలీసులు వారిని ట్రేస్ చేస్తే పిల్లలను అప్పగిస్తామని అధికారులు తెలిపారు. ఒకవేళ తల్లిదండ్రులు




దొరకని పక్షంలో, చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ చేపట్టేందుకు పోలీస్ శాఖ నుండి తగిన నివేదికలు అందించాలని కోరారు. దీనిపై సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో చర్చించి దర్యాప్తును వేగవంతం చేస్తామని, చిన్నారులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ ఇన్చార్జి అధికారి సౌరం ప్రవీణ్ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ ఎస్. భాస్కర్, సోషల్ వర్కర్ మెరుగు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నువ్వుల విత్తనాల పంపిణీ



**వరంగల్ వాయిస్, దామెర:** వ్యవసాయ కళాశాల వరంగల్, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని పులుకుర్తి గ్రామంలో రైతులకు ఉచితంగా విత్తనాల పంపిణీ నిర్వహించారు. కళాశాల దత్తత గ్రామమైన పులుకుర్తిలో సుమారు 10 ఎకరాలకు సరిపడా నువ్వుల విత్తనాలను 10 మంది రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల ప్రతినిధులు అసిస్టెంట్ ప్రొఫెసర్ శివకృష్ణ, ప్రొఫెసర్ నరేంద్ర మాట్లాడుతూ.. రైతులు ఆధునిక సాగు పద్ధతులు అవలంబించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రామకృష్ణ, గ్రామ మాజీ ఉపసర్పంచ్ పెంచాల రాజు, రైతు ప్రతినిధులు కాశెట్టి లక్ష్మణ్, గోపు సతీష్, సముద్రాల రాజు, భూతం యుగేందర్, రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్ విమర్శించారు. శుక్రవారం వరంగల్ శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను విద్యార్థి సంఘం బృందం సందర్శించి, మధ్యాహ్న భోజన నాణ్యతను, పాఠశాలలోని వసతులను పరిశీలించింది. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన అనంతరం చుక్క ప్రశాంత్ మాట్లాడుతూ.. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఏకరువు పెట్టారు. అక్షయపాత్ర ద్వారా అందుతున్న భోజనంలో కూరలు రుచిగా ఉండటం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా, ఇప్పటి వరకు పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర బడ్జెట్‌లోనూ విద్యకు తక్కువ నిధులు కేటాయించడం వల్ల నాణ్యమైన విద్య, భోజనం అందడం లేదన్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రిని కేటాయించి, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కమిటీ సభ్యులు వెనీష్, పవన్, నాయకులు రమేష్, రంజిత్ పాల్గొన్నారు.

# 12న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

## ఆల్ ట్రేడ్ యూనియన్ల పిలుపు



**వరంగల్ వాయిస్, వరంగల్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 2026 ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్ల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ ఓంకార్ భవన్‌లో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అరూర్ కుమార్ తదితరులు మాట్లాడుతూ.. వంద ఏళ్ల పోరాట ఫలితంగా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మిక వర్గానికి మరణ శాసనమని మండిపడ్డారు. ఎనిమిది గంటల పని దినాన్ని రద్దు చేసి 12 గంటల పనిని చట్టబద్ధం చేయడం దారుణమని ధ్వజమెత్తారు. ఈ నూతన చట్టాల ద్వారా భారతదేశంలోని 44 కోట్ల మంది కార్మిక వర్గాన్ని కేంద్రం నూతన బానిసత్వంలోకి నెడుతోందని ఆరోపించారు. లేబర్ కోడ్‌లు అమలైతే కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ వంటి సామాజిక భద్రతా పథకాలు కనుమరుగవుతాయని, కార్మిక సంఘాల అస్తిత్వానికే ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడుకోవడానికి, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్న లేబర్ కోడ్‌లను తిప్పికొట్టడానికి ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో వరంగల్ జిల్లాలోని కార్మికులందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. అలాగే ఉపాధి హామీ నూతన చట్టాన్ని కూడా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు గంగుల దయాకర్ (ఐఎఫ్ టీయూ), సుంచు జగదీశ్వర్ (ఏఐసీటీయూ), జన్ను ప్రకాష్ (సీఐటీయూ), జాన్ పాల్ (ఏఐటీయూసీ) అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాయకులు ముక్కెర రామస్వామి, అక్కనపల్లి యాదగిరి, మాలోత్ సాగర్, ఎగ్గని మల్లికార్జున్, మహబూబ్ పాషా, రత్నం, రాములు, చిరంజీవి తదితర కార్మిక సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# శివరాత్రి మహోత్సవాలకు సంపూర్ణ సహకారం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, గణపురం:** కాకతీయుల అద్భుత కళాక్షేత్రం, చారిత్రక ప్రసిద్ధి గాంచిన గణపురం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్లు)లో నిర్వహించే మహాశివరాత్రి మహోత్సవాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హామీ ఇచ్చారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన శివరాత్రి ఉత్సవాల గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగేలా చూస్తామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తన వంతు తోడ్పాటునందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి, వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, గణపురం సర్పంచ్ కట్కూరి రాధికా శ్రీనివాస్, కోటగుళ్ల పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, చెల్పూర్ సొసైటీ చైర్మన్ గండ్ర సత్యనారాయణరెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ అశోక్, సర్పంచ్ ఇంజపెల్లి శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యులు చోటెమియా, లింగంపల్లి వేణుగోపాలరావు తదితర నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఓటు మీది.. అభివృద్ధి మాది

## దమ్మన్నపేట సర్పంచ్ దుబాసి నవీన్



**వరంగల్ వాయిస్, పరకాల/దామెర :** పరకాల మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ శ్రేణులు వార్డుల్లో దూసుకుపోతున్నాయి. 9వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి బండారి కవిత-కృష్ణ విజయమే లక్ష్యంగా ఎన్నికల ఇంచార్జి, దమ్మన్నపేట సర్పంచ్ దుబాసి నవీన్ ఆధ్వర్యంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు. శుక్రవారం వార్డులోని ప్రతి ఇంటిని సందర్శించి, కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా దుబాసి నవీన్ మాట్లాడుతూ.. "ఓటు మీది - అభివృద్ధి మాది" అనే నినాదంతో ప్రజల ముందుకు వెళ్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో 9వ వార్డు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి రాజేష్, నాయకులు గణపతి రెడ్డి, నాగరాజు, ఉమ, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రానిది విద్యార్థి వ్యతిరేక బడ్జెట్

- హనుమకొండలో ఏఐఎస్ఎఫ్ నిరసన
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం




**వరంగల్ వాయిస్, హనుమకొండ:** దేశంలో విద్యను హక్కుగా కాకుండా వ్యాపార వస్తువుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం భారీ నిరసన నిర్వహించారు. హనుమకొండలోని అంబేద్కర్ కూడలి వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను విద్యార్థి నాయకులు దగ్ధం చేసి, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్, జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి ప్రణీత్ గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రం అమలు చేస్తున్న వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్ విధానాలు పరోక్షంగా విద్య ప్రైవేటీకరణకు దారితీస్తున్నాయని మండిపడ్డారు. విద్యార్థి లోకానికి హాని చేసే ఈ విధానాలను తాము "విద్యార్థి వ్యతిరేక బిల్లు"గా పరిగణిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత కేంద్ర బడ్జెట్‌ను "యాంటీ ఎడ్యుకేషన్ బడ్జెట్"గా వారు అభివర్ణించారు. జీడీపీలో విద్యకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడమే కాకుండా.. స్కాలర్‌షిప్‌లు, హాస్టల్ నిధులు, రీసెర్చ్ ఫండ్స్‌లో భారీగా కోతలు విధించడం వల్ల పేద, గ్రామీణ, వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెరిట్ పేరుతో సామాజిక న్యాయాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను అడ్డుకుంటామని నాయకులు హెచ్చరించారు. విద్యా రంగ ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలి, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు తగిన నిధులు కేటాయించాలి, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థులకు ఫెలోషిప్‌లు, సమాన అవకాశాలు కల్పించాలి, యూజీసీ ఈక్విటీ నిబంధనలను సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని సంతోష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, వేల్పుల చరణ్, జక్కుల భాను ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జా జ్యోతి, యూనివర్సిటీ అధ్యక్షుడు కొమ్ము సాయి, నాయకులు వినయ్, కొండ చరణ్, రమేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం విద్యావ్యవస్థపై 'ఆర్ఎస్ఎస్' ఎజెండాను రుద్దుతోంది

- ఏఐఎస్ఎఫ్ నేతల నిరసన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రతిపాదించిన 'వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్'-2025 బిల్లును అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) తీవ్రంగా వ్యతిరేకించింది. ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి పిలుపు మేరకు శుక్రవారం వరంగల్ జిల్లా రక్షయాపేటలోని కాకతీయ విశ్వవిద్యాలయ అనుబంధ డిగ్రీ కళాశాల ఎదుట విద్యార్థులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, నాయకులు ల్యాధల్లా శరత్ మాట్లాడుతూ.. ఈ బిల్లు రాజ్యాంగ మూల సూత్రాలకు విరుద్ధమని మండిపడ్డారు. దేశంలోని ఉన్నత విద్యా వ్యవస్థ లౌకిక, శాస్త్రీయ స్వభావాలను దెబ్బతీస్తూ, విశ్వవిద్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న యూజీసీ, ఏఐసీటీఈ వంటి స్వయంప్రతిపత్తి గల సంస్థలను రద్దు చేసి, వాటి స్థానంలో కేవలం 12 మంది సభ్యులతో కూడిన కేంద్రీకృత కమిషన్‌ను ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఢిల్లీ నుంచి విద్యా వ్యవస్థను నియంత్రించేలా ఈ కమిషన్ ఉంటుందని, ఇది రాష్ట్రాల మరియు విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని విచ్ఛిన్నం చేస్తుందని హెచ్చరించారు. విద్యా రంగాన్ని ప్రజా ప్రయోజనం నుండి ప్రైవేటు వస్తువుగా మార్చే నయా ఉదారవాద ఎజెండాను బీజేపీ వేగవంతం చేస్తోందని విమర్శించారు. దీనివల్ల పేద, అట్టడుగు వర్గాలకు విద్య దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ -2025 బిల్లును ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులు, మేధావులు, విద్యావేత్తలను ఏకం చేసి దేశవ్యాప్త పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శివ కుమార్, సీహెచ్.హరీష్, కార్తీక్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్.. కార్పొరేట్ వర్గాలకే ఊడిగం

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి
- తెలంగాణకు మరోసారి మొండిచేయి



**వరంగల్ వాయిస్, శాయంపేట:** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం సామాన్య ప్రజలను విస్మరించి, కేవలం కార్పొరేట్ వర్గాలకు ఊడిగం చేస్తోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం శాయంపేట మండల కేంద్రంలో ఎం.డీ.అంకుశావలీ అధ్యక్షతన జరిగిన సీపీఐ మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసేలా ఉందని భిక్షపతి మండిపడ్డారు. బడా కంపెనీలకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ, పేద, మధ్యతరగతి వర్గాలను విస్మరించారని ఆరోపించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అరకొర నిధులు కేటాయించి కేంద్రం తన నిర్లక్ష్యాన్ని చాటుకుందని అన్నారు. ఆదాయపు పన్ను తగ్గింపుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉద్యోగులకు ఈ బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం మరోసారి తుంగలో తొక్కిందని ఆయన ధ్వజమెత్తారు. తెలంగాణకు హైస్పీడ్ రైళ్లు తప్ప, ప్రాజెక్టులకు లేదా పరిశ్రమలకు ప్రత్యేక నిధులు కేటాయించలేదు. పునర్విభజన చట్టం ప్రకారం వెనుకబడిన జిల్లాలకు రావాల్సిన నిధులపై కూడా కేంద్రం మొండిచేయి చూపిందని తోట భిక్షపతి అన్నారు. 'సబ్ కా సాత్ – సబ్ కా వికాస్' అనేది కేవలం మాటలకే పరిమితమైందని, క్షేత్రస్థాయిలో 'కార్పొరేట్ కా వికాస్' మాత్రమే జరుగుతోందని ఎద్దేవా చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.ఏ. స్టాలిన్, మండల కార్యదర్శి బత్తిని సదానందం, సహాయ కార్యదర్శి అనుకారి అశోక్, నాయకులు ముంద్రాతి రమేష్, గొట్టిముక్కల రాజు, బోగి రమేష్, ఉప్పుల సాంబయ్య, ఐరబోయిన నరేష్, మహిళా నాయకురాళ్లు బోగి రామదేవి, తీగల కల్పన, వైదులు రమా, ముస్కుల సరోజన పాల్గొన్నారు.

# పరీక్షా ప్యాడ్‌ల పంపిణీ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సాఫ్ట్వేర్ ఇంజనీర్ వేమిశెట్టి ప్రభు కుమార్ ఆకాంక్షించారు. వరంగల్ లోని ఏవీవీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మూకాంబికా వరంగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభు కుమార్–హిమబిందు దంపతులు శుక్రవారం పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. విద్యార్థుల కోసం నిరంతర సహాయం ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డా.భుజేందర్ రెడ్డి, విద్యా సలహాదారులు వాసుదేవులు మాట్లాడుతూ, వేమిశెట్టి ప్రభు కుమార్ పాఠశాల అభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. గత ఏడాది విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేయడమే కాకుండా, పాఠశాల నూతన భవన నిర్మాణంలో ఒక తరగతి గది కోసం రూ.5 లక్షల భారీ విరాళాన్ని అందజేసినట్లు గుర్తు చేశారు. నేడు విద్యార్థుల అవసరార్థం పరీక్షా ప్యాడ్‌లను బహుకరించడం వారి సేవా దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల యాజమాన్యం వేమిశెట్టి హిమబిందు – ప్రభు కుమార్ దంపతులతో పాటు కుక్కడపు కుసుమ, దొడ్డా రమేష్ కుమార్‌లను ఘనంగా సత్కరించింది. ఏవీవీ విద్యా సంస్థల శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, దాతల కుటుంబ సభ్యులు భాగ్యరేఖ, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేయూలో రేపు 'మెగా జాబ్ మేళా'



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు నిరుద్యోగ యువతకు శుభవార్త. కేయూ ప్లేస్‌మెంట్ సెల్, హైదరాబాద్ మేజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో భారీ జాబ్ మేళా నిర్వహించనున్నారు. హైదరాబాద్‌కు చెందిన "సీ.ఐ.ఎస్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ " ఆధ్వర్యంలో ఈ రిక్రూట్‌మెంట్ జరగనుంది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ క్యాంప్ ఆఫీస్‌లో ఈ మెగా జాబ్ మేళా పోస్టర్‌ను రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. 2023, 2024, 2025 సంవత్సరాల్లో డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన వారు, 2026లో పూర్తి చేయబోయే ఏ గ్రాడ్యుయేట్ అయినా దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 650 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారు హైదరాబాద్ కేంద్రంగా పనిచేయాల్సి ఉంటుంది. శనివారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరగనుంది. ప్లేస్‌మెంట్ సెల్ సంచాలకులు డాక్టర్ చిర్రా రాజు మాట్లాడుతూ.. ఈ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు వెంటనే ఉచితంగా నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఇంజనీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు డాక్టర్ సంతోష్, బొల్లం కిరణ్, మేజిక్ బస్ ఫౌండేషన్ ప్రతినిధులు రాకేష్ ల్యాదేల్ల, నందేశ్వర్ పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉద్యోగ ప్రదాతలుగా ఎదగాలి

- కేయూ వీసీ ఆచార్య ప్రతాప్ రెడ్డి



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం వెతికేవారు మాత్రమే కాకుండా, కొత్త ఆవిష్కరణలతో పారిశ్రామికవేత్తలుగా, ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలని కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ టీ–హబ్, కాకతీయ యూనివర్సిటీ కె–హబ్ ల సంయుక్త నిర్వహణలో విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో నిర్వహించిన "ఓరియంటేషన్ సెషన్"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు టీ–హబ్, కె–హబ్ లు శిక్షణ, ఇంక్యుబేషన్ సౌకర్యాలను కల్పిస్తున్నాయని, ఇందుకు సంబంధించి అవగాహన ఒప్పందాలు కుదిరాయని వీసీ తెలిపారు. వరంగల్ వంటి టీయర్–2 నగరాల్లోని ప్రతిభను గుర్తించి, స్థానికంగా స్టార్టప్ సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఎంపిక చేసిన 100 మంది విద్యార్థులకు పూర్తి స్థాయి సాంకేతిక, ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యకలాపాలు విద్యార్థులకు పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉంటాయని, విద్యార్థులతో పాటు యువ అధ్యాపకులు కూడా తమ ఐడియాలను పంచుకోవచ్చని తెలిపారు. హైదరాబాద్ ఏఐసీ–టీ–హబ్ ప్రతినిధి రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. కేయూలోని కె–హబ్ ను భవిష్యత్తులో టీ–హబ్ స్థాయికి తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందించామన్నారు. విద్యార్థులు ఐపీఓ స్థాయికి వెళ్లే కంపెనీలను స్థాపించేలా ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీ–హబ్ సహకారంతో రాణించిన స్టార్టప్ వ్యవస్థాపకులు డాక్టర్ వినోద్ (Infi Potential), సయ్యద్ రాష్వన్ (Ara Fin), స్వాతి, రుశిత (No–vation Learning), అరుణ్ రెడ్డి (Change Cart) తమ విజయగాథలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, కె–హబ్ డైరెక్టర్ ఆచార్య టి. సవితా జ్యోత్స్న, రూసా నోడల్ ఆఫీసర్ ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, టీ–హబ్ ప్రతినిధులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పరకాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఆ అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతితో కలిసి 1, 2, 10, 11, 13 వార్డులలో ముమ్మరంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మోసపూరిత మాటలను ప్రజలు నమ్మవద్దని కోరారు. గత బీఆర్ఎస్ పాలకులు అభివృద్ధి పేరుతో ప్రజలను దోచుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా రంజక పథకాలను ఆయన ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. డల్ మున్సిపాలిటీగా పరకాల ప్రత్యేక డీపీఆర్ వ్యవస్థ ద్వారా పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, స్వచ్ఛమైన తాగునీరు వంటి కనీస వసతులతో పరకాలను ఆదర్శంగా మారుస్తామని హామీ ఇచ్చారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి తోడ్పడతానని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, వార్డు అభ్యర్థులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు..



**వరంగల్ వాయిస్, పరకాల :** అధికారంలోకి వచ్చేందుకు సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను వంచించిన కాంగ్రెస్ నాయకులకు ఈ మున్సిపల్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. పరకాల మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన 1, 2, 13 వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. పరకాలకు మున్సిపాలిటీ హోదా తీసుకురావడంతో పాటు, పట్టణంలో మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలు కేవలం బీఆర్ఎస్ పాలనలోనే సాధ్యమైందని గుర్తు చేశారు. "కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదు. మాయమాటలతో మళ్ళీ ఓట్ల కోసం వస్తున్న వారిని ప్రజలు నిలదీయాలి" అని ఆయన అన్నారు. ఇంటింటికీ వెళ్తున్న తమకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని, బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు పట్టణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల కోఆర్డినేటర్, రాష్ట్ర మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ నాయకులు, వార్డు అభ్యర్థులు, మహిళా, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డాక్టర్ అనితా రెడ్డికి 'బెస్ట్ కన్జుమర్ లీడర్' అవార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వినియోగదారుల హక్కుల పరిరక్షణలో విశేష కృషి చేస్తున్న డాక్టర్ కరుకాల అనితా రెడ్డికి ప్రతిష్టాత్మకమైన 'బెస్ట్ కన్జుమర్ లీడర్' అవార్డు లభించింది. వరల్డ్ వైజ్ కన్జుమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్ మరియు సివిల్ సప్లయ్ డిపార్ట్మెంట్ విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్‌గా సేవలందిస్తున్న ఆమెకు, సంస్థ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ రామానుజ స్వామి ఈ అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. వ్యాపార ప్రకటనలు, నాణ్యత లేని వస్తువుల విషయంలో మోసపోయిన సామాన్య ప్రజలకు చట్ట ప్రకారం న్యాయం జరిగేలా ఆమె చేసిన పోరాటాన్ని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు డాక్టర్ రామానుజ స్వామి తెలిపారు. అవార్డు అందుకున్న అనంతరం డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని అవగాహన కార్యక్రమాలతో ప్రజలకు అండగా ఉంటానని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల సంఘం ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని డాక్టర్ అనితా రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మాట తప్పిన పాపాత్ముడు రేవంత్ రెడ్డి

■ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** దేవుడి మీద ప్రమాణం చేసి రుణమాఫీ చేస్తానని చెప్పి, నేడు మాట తప్పిన పాపాత్ముడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డోర్నకల్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన వివిధ వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయార్థం ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచిందని విమర్శించారు. ఆడపడుచులకు తులం బంగారం, మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి రెండేళ్లు గడిచినా అతీగతీ లేదని మండిపడ్డారు. రూ.4000 పెన్షన్ ఇస్తామని ఆశ చూపి అవ్వతాతలను మోసం చేశారని, కేసీఆర్ హయాంలో అందిన బతుకమ్మ చీరల పంపిణీని కూడా రేవంత్ రెడ్డి నిలిపివేశారని ఆరోపించారు. ఐదు పంటలకు రావాల్సిన రైతు బంధును కేవలం రెండు పంటలకే ఇచ్చి మిగతా మూడు పంటలకు ఎగ్గొట్టారని ధ్వజమెత్తారు. ఉచిత బస్సు అని చెప్పి మగవారికి టికెట్ రేట్లు పెంచడమే కాకుండా, బస్సుల్లో మహిళలకు సీట్లు దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నారని ఎద్దేవా చేశారు. హక్కుల కోసం అడిగే ప్రజలను రేవంత్ రెడ్డి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని రెడ్యానాయక్ విమర్శించారు. "పెన్షన్ అడిగితే లాగుల్లో తొండలు వదులుతానని, బంగారం అడిగితే గుడ్లు పీకి గోటీలు ఆడుతానని అనడం ఒక ముఖ్యమంత్రికి తగునా?" అని ప్రశ్నించారు. హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదని, కేవలం బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలు నాయక్, విద్యాసాగర్, బిక్షం రెడ్డి, పాండు నాయక్, వెంకటేశ్వర్లు, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ధర్మాన్ని గెలిపించండి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డోర్నకల్ మున్సిపల్ ఎన్నికల్లో కేవలం అధికారం కోసమే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు లోపాయకారి ఒప్పందంతో జతకట్టాయని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్యాణ్ నాయక్ విమర్శించారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన పాల్గొని, బీజేపీ అభ్యర్థుల విజయార్థం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ్ నాయక్ మాట్లాడుతూ.. పట్టణాన్ని దశాబ్దాలుగా వెనుకబాటుకు గురిచేసిన పార్టీలకు ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈసారి బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే, కేంద్ర ప్రభుత్వ నిధులతో డోర్నకల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం" అని హామీ ఇచ్చారు. ప్రలోభాలకు లొంగవద్దు ప్రతిపక్షాల ప్రలోభాలకు, మాయమాటలకు ఓటర్లు లొంగవద్దని, ధర్మం వైపు నిలబడి కమలం గుర్తుకు ఓటు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు, నాయకులు దేవ నాయక్, నేతికొప్పుల సురేష్, ప్రభాస్ నాయక్, నంజ్యాల అశోక్, రెహ్మాన్, గణేష్, హన్మంత్, పందర్ లడ్డా, జానయ్య, దాసరి కృష్ణవేణి, రమాదేవి, పార్వతి, జయరాజు పాల్గొన్నారు.

## నూతన ఆవిష్కరణలతోనే మానవ జీవన గతిలో మార్పు



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్:** ప్రతి కొత్త సాంకేతిక అప్లికేషన్ మానవ జీవన గమనాన్ని మార్చే శక్తి కలిగి ఉంటుందని కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి అన్నారు. కేయూ భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "Advanced Molecules and Materials: Characterization and Applications (AMMCA – 2026)" అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మంజుల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వీసీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సస్టైనబిలిటీయే లక్ష్యం కావాలి ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. భారతదేశం సహజ వనరులకు నిలయమని, భూపొరల్లో లభించే విభిన్న పదార్థాలను మానవాళి అభివృద్ధికి ఉపయోగపడేలా పరిశోధనలు చేయాలని సూచించారు. డైరెక్టర్ డాక్టర్ మంజుల, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం మాట్లాడుతూ.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా అధిక సామర్థ్యం గల పదార్థాల రూపకల్పన ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్, వైద్య, పర్యావరణ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అతిథులు సదస్సు పరిశోధనా పత్రాల అబ్స్ట్రాక్ట్‌లను విడుదల చేశారు. డీన్ ఆచార్య హనుమంతు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ అధ్యక్షురాలు డాక్టర్ ఎన్. వరలక్ష్మి, ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, ఆచార్య సి.జే. శ్రీలత, డాక్టర్ ఎ.రాజు, డాక్టర్ నరేందర్, డాక్టర్ పద్మజ, డాక్టర్ ఈ.వి రావు, డాక్టర్ ఎం.నర్సింహులు, బోధనా సిబ్బంది, పరిశోధకులు పాల్గొన్నారు.

## స్నేహితుడికి పరామర్శ



**వరంగల్ వాయిస్, కమలాపూర్:** స్నేహితుడి కుటుంబానికి మిత్రులు అండగా నిలిచారు. మండలంలోని గూడూరు గ్రామంలోని కొండపాక వెంకటనారాయణ తల్లి వసంత ఇటీవల అకాల మరణం చెందారు. దీంతో వెంకటనారాయణను టెన్త్(1997–98) బ్యాచ్ మిత్రులు శుక్రవారం పరామర్శించి ఓదార్చారు. వెంకటనారాయణ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో శ్రీనివాస్ యాదవ్ భాషబోయిన, పిల్లల వినయ్, కుక్కల తిరుపతి, నేరెళ్ల నిరంజన్, నరిగె రాజు, శ్రీరాముల వెంకటేశ్, నద్దునూరి కుమార్, భాషబోయిన కుమార్, లోకిని రమేశ్, ఆవునూరి రమేశ్, ఉప్పుల తిరుపతి, గుడికందుల రాజు, లోకిని రమేశ్, నరిగె రవి, భాషబోయిన దేవేందర్ ఇతర మిత్రులు ఉన్నారు.


## భూపాలపల్లిలో ఎగిరేది గులాబీ జెండానే

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని, అభివృద్ధి కేవలం కారు గుర్తుతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు (మైబ్ పల్లి, పిల్లోనిపల్లి, బిసి కాలనీ), 29వ వార్డు (న్యూ సుభాష్ కాలనీ, MD క్వార్టర్స్), 27వ వార్డు (జవహర్ నగర్ కాలనీ)లలో ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. "అధికారంలోకి వస్తే 6 గ్యారెంటీలు ఇస్తామన్న రేవంత్ రెడ్డి, ఆ 420 హామీలను ఎందుకు విస్మరించారు?" అని ప్రశ్నించారు. కేసీఆర్ ఎంతో కష్టపడి, ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరుతో ఏర్పాటు చేసిన జిల్లాలను రద్దు చేస్తామని రేవంత్ రెడ్డి అనడం ప్రజలను వంచించడమేనన్నారు. కాలనీ ప్రజలను 'స్లమ్ ఏరియా వాళ్ళు' అంటూ దూషించడం కాంగ్రెస్ అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలోనే జీ.వో 58 ద్వారా పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశామని గుర్తు చేశారు. మాటలు చెప్పే కపట మోసగాళ్లను నమ్మి మోసపోవద్దని, అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. 9వ వార్డు అభ్యర్థి పిల్లి వేణు, 29వ వార్డు అభ్యర్థి గండ్ర హరీష్ రెడ్డి, 27వ వార్డు అభ్యర్థి వేశాల ఈశ్వరమ్మలను కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. అధికార పార్టీ తప్పులను ఎండగడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతామని గండ్ర హామీ ఇచ్చారు.

## పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. ఇందులో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, జనరల్ అబ్జర్వర్ నర్సింహా రెడ్డిల సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఈ ప్రక్రియ కొనసాగింది. జనగామ, స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులను (OPO) కంప్యూటర్ ర్యాండమైజేషన్ పద్ధతి ద్వారా కేటాయించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. జనగాం మున్సిపాలిటీ కి సంబంధించి 80 పీఓ, 80 ఏపీఓలు, 240 ఓపీఓలను, స్టేషన్ ఘనపూర్ కి సంబంధించి 44 పీఓ, 44 ఏపీఓ, 132 ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా నియమించారు.ఈ కార్యక్రమం లో స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, నోడల్ అధికారి హౌసింగ్ పీడీ మాతృ నాయక్ పాల్గొన్నారుస

# నాయిని రాజేందర్ రెడ్డి దళిత పక్షపాతి

◆ అసత్య ఆరోపణలు చేస్తే సహించం
◆ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దళితుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న దళిత పక్షపాతి అని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం హనుమకొండ అశోక జంక్షన్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే నాయినిపై బీఆర్ఎస్ నాయకులు మరియు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ చేస్తున్న విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తన మేధావితనాన్ని పక్కన పెట్టి, రాజకీయ లబ్ధి కోసం పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని రామకృష్ణ మండిపడ్డారు. "గతంలో బీఎస్పీలో ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టును కమీషన్ల కోసమే కట్టారని విమర్శించిన ప్రవీణ్ కుమార్, ఇప్పుడు బీఆర్ఎస్ పంచన చేరి కాంగ్రెస్ పార్టీనే బాంబులు పెట్టి ప్రాజెక్టును పేల్చిందని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది" అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దళితులను అవమానించారనే ప్రచారంలో వాస్తవం లేదని రామకృష్ణ వివరించారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే దళితుల స్మశాన వాటిక కోసం 3 ఎకరాల భూమిని కేటాయించి తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. దళిత నాయకులను ఎప్పుడూ గౌరవిస్తూ, తన పక్కన కూర్చుండబెట్టుకుని పనుల్లో భాగస్వామ్యం కల్పిస్తూ కొత్త నాయకులను తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై గానీ, ఎమ్మెల్యే నాయినిపై గానీ బురద జల్లడం మానుకోవాలని రామకృష్ణ హెచ్చరించారు. "ఒక మాజీ ఐఏఎస్ అధికారి అయి ఉండి, కేసీఆర్, కేటీఆర్‌ల చేతిలో పావుగా మారి ఇలాంటి విమర్శలు చేయడం ఆయన స్థాయికి తగదు. ఇదే తీరు కొనసాగితే కేటీఆర్‌ను వరంగల్ జిల్లాలో తిరగనివ్వమని" ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ, ఎస్సీ డిపార్ట్‌మెంట్ కన్వీనర్ ఆరూరి సాంబయ్య, వినయ్, ఎర్ర మహేందర్, సంగీత్ సుధాకర్, శ్వేత అనిల్, వల్లాల జగన్ గౌడ్, అడ్వకేట్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 11న ఓటీటీలోకి
# అనగనగా ఒక రాజు



ఈ ఏడాది సంక్రాంతికి థియేటర్లలో విడుదలైన సినిమాల్లో 'అనగనగా ఒక రాజు' ఒకటి. ఈ మూవీ ఓటీటీ రిలీజ్ డేట్ ఖరారైంది. ఈనెల 11 నుంచి 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ కానుంది. గోదావరి నేపథ్యంతో కామెడీ ఎంటర్‌టైనర్‌గా వచ్చిన 'అనగనగా ఒక రాజు' పండగ సినిమా అనిపించుకుంది. తన కామెడీ టైమింగ్ ఎలాంటిదో హీరో నవీన్ పొలిశెట్టి ఈ చిత్రంతో మరోసారి నిరూపించారు. ఆయనకు జోడీగా నటించిన వి□నాక్షీ చౌదరి అందం, అభినయంతో ఆకట్టుకున్నారు. ఈ మూవీలో చమ్మక్ చంద్ర, 'సంక్రాంతికి వస్తున్నాం' ఫేమ్ బుల్లిరాజు, రావు రమేశ్ తదితరులు సందడి చేశారు. దర్శకుడు మారి తెరకెక్కించిన ఈ సినిమా జనవరి 14న విడుదలైన సంగతి తెలిసిందే. రూ.100? కోట్లు కలెక్ట్ చేసిన సందర్భంగా.. హీరో నవీన్‌కు ప్రొడ్యూసర్ నవీన్ ఎర్నేని తాజాగా కంగ్రాట్స్ చెప్పారు. తమ కాంబినేషన్‌లో మరో మూవీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా అని తెలిపారు.

## మాదక ద్రవ్యాల ప్రభావంతో..




ఎన్నో విజయవంతమైన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ గుణశేఖర్... కానీ, కొన్నేళ్లుగా ఆయన సినిమాలేవీ ఆశించిన స్థాయిలో అలరించలేకపోయాయి. ఈ నేపథ్యంలోనే ఈసారి విజయమే లక్ష్యంగా యువతరాన్ని దృష్టిలో పెట్టుకుని తీసిన చిత్రం 'యుఫోరియా' శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. చైత్ర (సారా అర్జున్) ఓ పెద్దింటి అమ్మాయి. చదువులో టాపర్. ఐఏఎస్ అవ్వాలన్నది తన లక్ష్యం. దాని కోసమే పట్టుదలగా పరీక్షలకు సిద్ధమవుతుంటుంది. ఓరోజు తన మిత్రురాలు ఓ పబ్ పార్టీకి పిలవడంతో అమ్మానాన్న అనుమతితో ఆ పార్టీకి వెళ్తుంది. అక్కడే వికాశ్ (విఘ్నేశ్ గవిరెడ్డి) తో పాటు అతని మిత్ర బృందం పరిచయమవుతుంది. చైత్ర అందచందాలు చూసి ఆకర్షితుడైన వికాశ్.. ఆమెపై కన్నేస్తాడు. తను తిరిగి వెళ్తున్న సమయంలో కారులో సరదాగా బయటకు వెళ్దామని ఆఫర్ చేస్తాడు. అయితే వికాశ్‌పై స్నేహభావంతో అతని కారెక్కిన చైత్రకు చేదు అనుభవం ఎదురవుతుంది. డ్రగ్స్ మత్తులో ఉన్న వికాశ్‌తో పాటు అతని మరో నలుగురు మిత్రులు ఆమెపై దారుణ రీతిలో అత్యాచారానికి పాల్పడతారు. మరి ఆ తర్వాత ఏమైంది? రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ రేప్ కేసును సిటీ కమిషనర్ జయదేవ్ (గౌతమ్ మేనన్) ఎలా ఛేదించారు? పేరు మోసిన రాజకీయ నేతలు, వ్యాపారవేత్తల పిల్లలు నిందితులుగా ఉన్న ఈ కేసును పరిష్కరించే క్రమంలో ఎదురైన సవాళ్లేంటి? ఈ కథ లో వింధ్య వేములపల్లి (భూమిక) పాత్రకి ఉన్న ప్రాధాన్యత ఏంటి? ఆమె 'నేను నేరం చేశాను.. శిక్ష విధించండి' అంటూ' హైకోర్టు మెట్లు ఎక్కడానికి వెనకున్న కారణమేంటి? కమిషనర్ జయదేవ్ ప్రారంభించిన 'ఆపరేషన్ యుఫోరియా' లక్ష్యం ఏంటి? అన్నది మిగిలిన కథ. యువతరం మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ఏమవుతుంది.. ఆ మత్తులో విచక్షణ కోల్పోయి చేసే తప్పులకు పిల్లల జీవితాలతో పాటు కన్నవాళ్ల జీవితాలు ఎలా తలకిందుల య్యాయి? అనేది ఈ చిత్ర సారాంశం. రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన జూబ్లీహిల్స్ పబ్ అత్యాచార ఘటనతో పాటు మరికొన్ని కీలక సంఘటనల్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ కథను అల్లుకున్నట్లు అర్థమవుతోంది. నిజానికి ఈ చిత్ర ట్రైలర్‌తోనే సినిమా కథేంటి? అదెలా సాగనుందన్నది ముందే క్లారిటీగా చెప్పేశారు దర్శకుడు గుణశేఖర్. కాకపోతే దీన్ని ఆయన తెరపై ఏ కోణంలో ఆవిష్కరించారు? దీనిపై ఎంత లోతుగా చర్చించారన్నది అందరిలోనూ ఆసక్తిరేకెత్తించింది. అత్యాచార ఘటనకు సంబంధించిన వార్తల్ని అన్నింటిని ఓ దగ్గర పోగేసి తీసిన సినిమా ఇది. దీంతో ఆసక్తికర డ్రామాగా సాగాల్సిన మూవీ ఒక డాక్యుమెంటరీలా అనిపిస్తుంది.చైత్ర అత్యాచార ఘటన కేసు ఇన్వెస్టిగేషన్ మొదలయ్యాకే కథలో కాస్త సంఘర్షణ కనిపిస్తుంది. ఈ కేసులోని నిందితులతో కమిషనర్ జయదేవ్ వ్యవహరించే తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. ఇలాంటి అత్యాచార కేసుల్లో సాక్ష్యాల సేకరణ ఎలా ఉంటుందన్నది కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ క్రమంలో వచ్చే కొన్ని సన్నివేశాలు సున్నిత మనస్కులకు ఇబ్బందికరంగా అనిపించొచ్చు. అత్యాచార కేసులో జీవిత ఖైదు పడిన వికాశ్ గ్యాంగ్‌కు జైల్లో ఎదురైన అనుభవాలేంటి? కొడుకు చేసిన తప్పునకు ఓ తల్లిగా భూమిక సమాజం నుంచి ఎలాంటి అవమానాల్ని ఎదుర్కొంది? ఆమె తనపై తాను కేసు వేసుకుని కోర్టు మెట్లు ఎక్కడానికి కారణమేంటి? సమాజంలోని మాదక ద్రవ్యాల ముఠాల్ని ఏరిపారేసేందుకు కమిషనర్ జయదేవ్ చేపట్టిన ఆపరేషన్ యుఫోరియా ఏమైంది? అన్నది ద్వితీయార్ధానికి కీలకాంశాలు. ఆసక్తికరంగా సాగాల్సిన సెకండాఫ్ ఇన్ని పాయింట్ల మధ్య గాడి తప్పిన అనుభూతి కలుగుతుంది. తప్పు చేసిన కొడుక్కి సెకండ్ ఛాన్స్ ఇచ్చి.. అతన్ని మళ్లీ దారిలో పెట్టాలనుకునే తల్లి ఆలోచన మెచ్చుకోదగ్గదే అయినప్పటికీ ఆ ప్రయాణాన్ని కన్విన్సింగ్‌గా చూపించలేకపోయారు. పతాక ఘట్టాలు అందర్నీ ఆలోచింపజేసేలా.. మనసుల్ని కదిలించేలా ఉంటాయి.

## అర్జున్ కూతురు హీరోయిన్‌గా సీతాపయనం



ఈనెల 14న గ్రాండ్‌గా విడుదలకు సన్నాహాలు

యాక్షన్ కింగ్ అర్జున్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన విభిన్న కథా చిత్రం 'సీతా పయనం'. శ్రీ రామ్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా ద్వారా అర్జున్ కుమార్తె ఐశ్వర్య అర్జున్ వెండితెరకు కథానాయికగా పరిచయం అవుతుండటం విశేషం. నిరంజన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రలు పోషించగా, అర్జున్ స్వయంగా ఒక ప్రత్యేక పాత్రలో మెరవనున్నారు. అలాగే ఆయన మేనల్లుడు, యాక్షన్ ప్రిన్స్ ధ్రువ సర్జా కూడా ఈ మూవీలో స్పెషల్ కామియో రోల్‌లో కనిపించబోతున్నారు. ఈ సినిమాను ప్రేమికుల రోజు కానుకగా ఫిబ్రవరి 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ప్రస్తుతం అన్ని రకాల పోస్ట్ ప్రొడక్షన్ పనులతో పాటు సెన్సార్ కార్యక్రమాలను కూడా పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఇప్పటికే పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే విడుదలైన పాటలు, ఇతర కంటెంట్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే హృద్యమైన అంశాలతో పాటు, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రాన్ని అర్జున్ అద్భుతంగా తీర్చిదిద్దారు. తెలుగుతో పాటు కన్నడ, తమిళం, మలయాళం మరియు హిందీ భాషల్లో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో భారీగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత ప్రమాణాలతో రూపొందింది. జి. బాలమురుగన్ సినిమాటోగ్రఫీ అందించగా, ప్రముఖ రచయిత సాయి మాధవ్ బుర్రా పదునైన డైలాగ్స్ రాశారు. యాక్షన్ కింగ్ సినిమా అంటేనే ఫైట్స్ స్పెషల్‌గా ఉంటాయి కాబట్టి, ఈ చిత్రంలోని స్టంట్ సన్నివేశాలకు కిక్ యాస్ కాళీ కొరియోగ్రఫీ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వినూత్న ప్రచార కార్యక్రమాలతో ప్రేక్షకుల్లోకి వెళ్తున్న మేకర్స్, త్వరలోనే సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఫిబ్రవరి 14న ఐదు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న 'సీతా పయనం' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో వేచి చూడాలి.

## ఓటిటిలోకి అవార్డు ఫిలిమ్ సబర్ బోండా

'సన్‌డ్యాన్స్ ఫిల్మ్ ఫెస్టివల' (యూఎస్) లో ప్రదర్శితమై, విజేతగా నిలిచిన చిత్రం 'సబర్ బొండా'. ఈ అవార్డు సినిమా ఇప్పుడు ఓటీటీలోకి వచ్చింది. 'నెట్‌ఫ్లిక్స' ఫిబ్రవరి 6 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఆ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైన తొలి మరాఠీ సినిమా కూడా ఇదే కావడం విశేషం. 'క్యాక్టస్ పియర్స' టైటిల్‌తో మరాఠీలో రూపొందగా.. సన్‌డ్యాన్స్ చిత్రోత్సవంలో 'సబర్ బొండా' పేరుతో ప్రదర్శించారు. ఈ సినిమాని భూషణ్ మనోజ్, సురాజ్ సుమన్ ప్రధాన పాత్రల్లో రోహన్ పరశురామ్ తెరకెక్కించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు స్వలింగ సంపర్కుల కథగా ఈ సినిమా రూపొందింది. తండ్రీకొడుకుల సెంటిమెంట్‌కూ ఇందులో ప్రాధాన్యం ఉంది. గతేడాది జనవరిలో అవార్డు దక్కించుకున్న ఈ సినిమాని 'గోథెన్‌బర్గ్ ఫిల్మ్ ఫెస్టివల'లోనూ ప్రదర్శించారు. సెప్టెంబరులో థియేటర్లలో విడుదలైంది. టాలీవుడ్ హీరో రానాకు చెందిన 'స్పిరిట్ మీడియా' సంస్థ డిస్ట్రిబ్యూట్ చేయడం విశేషం.



# ఎన్నికలను సమర్థవంతంగా నిర్వర్తించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- మున్సిపల్ ఎన్నికలపై పీఓ, ఏపీఓలకు శిక్షణ



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మున్సిపాలిటీ ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డాక్టర్ సత్య శారద అన్నారు. మున్సిపల్ ఎన్నికల విధులను పీఓ, ఏపీఓలు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. శుక్రవారం వర్ధన్నపేట రైతు వేదికలో మున్సిపల్ ఎన్నికలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఇచ్చే మెటీరియల్, బ్యాలెట్ బాక్స్ ల సీలింగ్ ప్రిసైడింగ్ అధికారుల డైరీ, బ్యాలెట్ పేపర్ అకౌంట్ ఏజెంట్ల సమక్షంలోనే బ్యాలెట్ బాక్సులను తెరవడం, తర్వాత ఉదయం 7 గంటలకు పోలింగ్ స్టార్ట్ చేయడం తదితర అంశాలపై కలెక్టర్ పీఓ, ఏపీఓలకు వివరించారు. పోలింగ్ సామాగ్రి స్వీకరణ నుంచి పోలింగ్ ముగిసే వరకు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్లకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడంతోపాటు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ మొత్తం నిష్పక్షపాతంగా జరగాలని తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం టీ పోల్ లో అప్‌లోడ్ చేయాలని, పోలింగ్ కేంద్రంలోకి వాటర్ బాటిళ్లు, బ్యాగ్, మొబైల్, ఇంక్ ప్యాడ్ వంటివి అనుమతించవద్దని అన్నారు. 100 మీటర్ల అవతల వెహికల్స్ పార్కింగ్ చేసుకోవాలని, పోలింగ్ కేంద్రం వద్ద మెడికల్ టీమ్స్, వీల్ చైర్, అంగన్‌వాడీల సహాయకులు ఉంటారని తెలిపారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ నిర్వహణ కలెక్టర్ పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఎన్నికల నిర్వహణకు వినియోగించే బ్యాలెట్ బాక్సులు, సీల్స్, బ్యాలెట్ పేపర్లు తదితర ఎన్నికల సామగ్రిని కూడా కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల సామగ్రి భద్రత, సరైన నిల్వ, రవాణా ప్రక్రియలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా, తహసీల్దార్ విజయ్, మునిసిపల్ కమిషనర్ సుదీర్ కుమార్, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలల్లో కొత్త పార్టీ

- ముహూర్తం కోసం ఎదురుచూస్తున్న కవిత
- ప్రజలే తమ నాయకులంటూ ప్రకటన

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మరో మూడు నెలల్లో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తన రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకుంటానని చెప్పారు. తనకు సెంటిమెంట్ ఎక్కువన్న ఆమె.. మంచి మూహూర్తం కోసం ఎదురు చూస్తున్నానని తెలిపారు. కొంత కాలం గడిచిన తర్వాత తన బలం ఏంటో అందరికీ అర్థమవుతుందని కవిత వ్యాఖ్యానించారు. ప్రజలే తనను నాయకురాలిగా తీర్చిదిద్దాలని, వారి మద్దతే తనకు అసలైన బలమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌తో తనకు ఒరిగిందేమీ లేదని స్పష్టం చేసిన కవిత.. భవిష్యత్తులో తన రాజకీయ ప్రయాణం పూర్తిగా ప్రజల మద్దతుపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు ఎందుకు ప్రచారం చేయడం లేదని కవిత ప్రశ్నించారు. జాగృతి సంస్థ పోటీ చేస్తున్న ప్రాంతాల్లో హరీశ్ రావు ఎందుకు తిరుగుతున్నారని నిలదీశారు. అలాగే కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గానికే ఎందుకు పరిమితమయ్యారని ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. తనపై విమర్శలు చేస్తున్న వారిపై కవిత ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'గుంటనక్క, గూఢాచారి' వంటి పేర్లు వారికి నప్పుతాయి కాబట్టే అలా పిలుస్తున్నానన్నారు. రాజకీయాల్లో విమర్శలు సహజమేనని, కానీ వ్యక్తిగత ఆరోపణలు చేస్తే తాను కూడా మౌనంగా ఉండబోనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తన రాజకీయ వ్యూహం మరింత స్పష్టంగా ఉంటుందని, కొత్త పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలవుతుందని కవిత చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇదిలావుంటే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై జాగృతి అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

# వర్ధన్నపేట మున్సిపాలిటీపై కాంగ్రెస్ గురి

□ ఎన్నికల వ్యూహ రచనలో ఇనగాల, ఎమ్మెల్యే నాగరాజు


**వరంగల్ వాయిస్,వర్ధన్నపేట :** వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా పార్టీ ముఖ్య నాయకులు రంగంలోకి దిగారు. మున్సిపల్ ఎన్నికల కో–ఆర్డినేటర్, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు ఆధ్వర్యంలో వార్డు ఇంచార్జీలు, అభ్యర్థులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్ కూడా పాల్గొని దిశానిర్దేశం చేశారు. సమీక్షలో భాగంగా అభ్యర్థుల గెలుపు కోసం వార్డుల వారీగా బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులందరూ కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారంటీలైన మహాలక్ష్మి (ఉచిత బస్సు ప్రయాణం), గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రైతు భరోసా వంటి పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. వర్ధన్నపేటలో ప్రభుత్వం చేపట్టిన 100 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ స్కూల్ వంటి అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని అభ్యర్థులకు ఆదేశించారు. స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రజలకు నమ్మకం కలిగించాలని కోరారు. మున్సిపాలిటీలో గత రెండేళ్లలో జరిగిన మార్పును, భవిష్యత్తు ప్రణాళికలను వివరించి ఓటర్ల ఆశీస్సులు పొందాలని నాయకులు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, వార్డు అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అప్రమత్తంగా ఉండాలి


**వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ | పులి సంచారం నేపథ్యంలో ఆకస్మిక తనిఖీ**

**వరంగల్ వాయిస్, క్రైం :** రఘునాథ్ పల్లి మండలంలోని పరిసర ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశించారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతోపాటు ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా ఫారెస్ట్ సిబ్బందితో సమన్వయం చేసుకొని తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. శుక్రవారం రఘునాథ్ పల్లి పోలీస్ స్టేషన్ ను సీపీ సన్ ప్రీత్ సింగ్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి, రికార్డ్ రూమ్, స్టేషన్ రైటర్ రూమ్, రిసెప్షన్ సెంటర్, ఇతర విభాగాలను తనిఖీ చేశారు. వాటిని తగిన విధంగా సంరక్షించుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరాల రేటు, రోడ్డు ప్రమాదాలు, చోరీ కేసులు, నమోదైన కేసుల పురోగతిపై సీపీ ఆరా తీశారు. అధికారులు, సిబ్బంది పనితీరును మరింత మెరుగు పరుచుకోవాలన్నారు. పోలీసులు అనుసరించాల్సిన విధి విధానాలపై సంబంధిత స్టేషన్ ఎస్ఐ, సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ కు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ ఏసీపీ భీం శర్మ, సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రఘునాథ్పల్లి ఎస్ఐ నరేష్ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# అగ్రంపాడులో భక్తుల రద్దీ

**వరంగల్ వాయిస్,ఆత్మకూరు:** మినీ మే డారంగా ప్రసిద్ధిగాంచిన అగ్రంపాడు సమ్మక్క సారలమ్మ జాతరలో శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఈ సందర్భంగా జాతరకు భక్తుల పలు జిల్లా నుంచి వచ్చి తరలివచ్చి భక్తులు అమ్మ వాళ్లకు మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ప్రాంగణంలో పారిశుధ్యం పై అధికారులు దృష్టి సాధించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే అధికారులు జాతరలో పారిశుద్ధ్యం పైన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరారు.



# బీఆర్ఎస్‌తోనే ప్రగతి సాధ్యం

□ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల మున్సిపాలిటీ అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన పట్టణంలో జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థుల విజయార్థం ఓటర్లను ప్రత్యక్షంగా కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా 12వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి గంట కళావతికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆమెతో కలిసి ఇంటింటికీ వెళ్లిన చల్లా ధర్మారెడ్డి, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇదే క్రమంలో 2వ వార్డు అభ్యర్థి బొచ్చు శ్యామల బాబు రావు, 13వ వార్డు అభ్యర్థి దగ్గు సునీతలను కూడా భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చల్లా ధర్మారెడ్డి ఎండగట్టారు. అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారని, మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. వార్డుల అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేసే బీఆర్ఎస్ అభ్యర్థులను ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. 12వ వార్డు అభ్యర్థి గంట కళావతి మాట్లాడుతూ.. వార్డు అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానని, ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధించి నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, యూత్ విభాగం నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com